గౌతమ్ మోడల్ స్కూల్లో ఇన్వెస్టిట్యూర్ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుకల్లో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు

లక్ష్యం సాధించేందుకు నిరంతరం కృషి చేయాలి

ఆర్కేపురం, జూలై 20: సమయం చాలా విలువైందని.. లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆర్కేపురం డివిజన్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్లో ఇన్వెస్టిట్యూర్ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరసింహ, ప్రైమరి ఇన్‌చార్జి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌పార్క్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట, జూలై 20: గ్రీన్‌పార్క్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గ్రీన్‌పార్క్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో దేవాలయం వైస్ చైర్మన్ వల్లంల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. సరూర్‌నగర్ చెరువులోకి పలు ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీరు రావడంతో దోమల బెడద విపరీతంగా పెరగడంతో.. అనేక రోగాల బారిన పడుతున్నామని సమస్య పరిష్కరించాలని.. అదే విధంగా ఎఫ్‌టీఎల్ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీ గ్రీన్‌పార్క్ కాలనీవాసులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలన్నింటిని ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.బాల్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, గుర్రం కేశవరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, ఏనుగు రాజిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, కృష్ణారెడ్డి, రామస్వామి ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌ను ఘనంగా సన్మానిస్తున్న గ్రీన్‌పార్క్ కాలనీవాసులు

వీకే దాగే నగర్‌లో సీసీ రోడ్లు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

కాలనీవాసుల ఇబ్బందులను తొలగిస్తా: ఎమ్మెల్యే

సైదాబాద్, జూలై 20: సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శనివారం సైదాబాద్ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బి-కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని, అదే విధంగా కాలనీలోని సీసీ రోడ్లు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎస్సీబీహెచ్ పంచకాలనీలు, వీకే దాగేనగర్ కాలనీల్లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ, డీపీఈడీ పరీక్షా తేదీలు మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న డీఎస్సీ పరీక్ష జరుగనున్న నేపథ్యంలో ఆ రోజు నిర్వహించాల్సిన బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 19న నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 31 వరకు అవకాశం ఉంద న్నారు. ఇతర వివరాలకు 830903 7134, 6305895867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఫణిగిరికాలనీ వెంకటసాయినగర్‌లోని సాయిసన్నిధి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, తదితరులు

గురు పౌర్ణమి వేడుకలకు ముస్తాయిమైన సాయి సన్నిధి

ఎల్బీనగర్, జూలై 20: చైతన్యపురి ఫణిగిరికాలనీ వెంకటసాయినగర్ సాయిసన్నిధి దేవాలయం గురు పౌర్ణమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం ప్రత్యేక పూజల్లో ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివారం దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ నారంశెట్టి శ్రీనివాస్‌నాయుడు, వైస్ చైర్మన్ కె.హరి శంకర్, ప్రధాన కార్యదర్శి నర్సింహ ప్రసాద్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నేడు శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు

మన్సూరాబాద్, జూలై 20: శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ రజతోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శృంగారం తిరువేంగళాచార్యులు (ఎస్టీ చారి) తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పడి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి (భీమవరం) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచార్యులు, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచార్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకలకు శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరై రజతోత్సవ ప్రత్యేక సంచిక సుదర్శనంను ఆవిష్కరించి మంగళ శాసనాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతారని తెలిపారు. శ్రీవైష్ణవులు పెద్ద సంఖ్యలో పాల్గొని రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కండ్లకుంట్ల యాదగిరిచార్యులు, గౌరవ సలహాదారు చిలుకమర్రి లక్ష్మీనాథాచార్యులు, బీఎన్ చారి, రత్నమాచారి, ఆచార్య వేణు, సంఘం ప్రధానకార్యదర్శి సేనాపతి మోహన్, బద్రీనాథ్, రత్నకుమార్, రమాదేవి, మాధవి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ అధ్యక్షుడు ఎస్టీ చారి

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ మహేందర్‌రెడ్డి

కందుకూరు, జూలై 20: రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ మహేందర్‌రెడ్డి కోరారు. కేవలం కొంత మంది రైతులకే చేసి చేతులు దులుపుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రూ.లక్ష రుణం తీసుకున్న రైతులందరికీ మాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని.. కానీ కేవలం కొంతమంది రైతులకు మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. రుణ మాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని.. పైగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మొదటి విడుత లక్ష రూపాయలు ఉన్న వారికి మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి.. కేవలం కొంత మంది రైతులకే మాఫీ చేశారని తెలిపారు. రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని.. షరతుల పేరిత రైతులను మోసం చేయాలని చూస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవాలు

చంపాపేట, జూలై 20: బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం చంపాపేట డివిజన్ పరిధి బైరమాల్‌గూడలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా బ్యాంక్ వార్షికోత్సవాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. బైరమాల్‌గూడ బ్రాంచ్ ఖాతాదారులందరి ఆదరాభిమానాలు పొందుతూ ముందుకు సాగుతుందన్నారు. ఈ వార్షికోత్సవల్లో బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని బ్యాంకు ఖాతాదారులతో కలిసి కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోకొండ సూర్యప్రకాశ్, కోకొండ వైకుంఠం, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు అభినందనీయం..

హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ

సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ, తదితరులు

బంజారాహిల్స్, జూలై 20 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలు బాగున్నాయని.. కొత్త చట్టాలు తీసుకురావడం అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజీలో అన్‌లాకింగ్ 'కొత్త దిశలు -భారతదేశం యొక్క కొత్త క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు ప్రస్తుతం కొత్త చట్టాలలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు ఈ-ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేసుకునే వెసులుబాటు ఈ చట్టాల్లో కల్పించినట్లు తెలిపారు. ఏండ్ల తరబడి కేసులు సాగకుండా ప్రతి కేసుకు ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తూ రూపొందించబడ్డాయని తెలిపారు. టెర్రరిస్ట్ కార్యకలాపాలు, ఉద్దేశపూర్వకంగా నేరాలు చేసేవారికి ఇందులో కఠిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రస్తుతం సెక్షన్లలో బాధితులను ఆస్పత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన వారికి శిక్ష తగ్గుతుందని తెలిపారు. నిర్లక్ష్యంగా వెళ్లిపోయే వారికి కఠిన శిక్షలుంటాయన్నారు. టెక్నాలజీ సంబంధిత వీడియో, ఆడియో టెక్నికల్ ఎవిడెన్స్‌లకు గతంలో పోలిస్తే ప్రస్తుత చట్టాలలో మంచి ప్రాధాన్యతనిచ్చారని సొలిసిటర్ జనరల్ తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ.. కొత్త చట్టాలు పారదర్శకంగా.. సరళతరంగా ఉన్నాయని అన్నారు. ఆయా చట్టాలను సంక్షిప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య

మలక్‌పేట, జూలై 20: దివ్యాంగులకు చేయూత పేరుతో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. శనివారం నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు నుంచి దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్, డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమాన్ని దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించనున్నామని తెలిపారు. నెలలో 1, 3వ గురువారాల్లో దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతి నెలా 2,4వ గురువారాల్లో డయల్ యువర్ చైర్మన్ పేరుతో గ్రీవెన్స్ (100 శాతం వైకల్యం కలిగిన వ్యక్తులకోసం) నిర్వహించనున్నామని అన్నారు. దివ్యాంగుల సమస్యలు తెలుసుకొని పరిష్కారం చేయటం కోసం ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించి వారికి భరోసా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించటం జరిగిందన్నారు. దివ్యాంగులకు కోసం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు.

ఆరోగ్య రక్షణకు యోగా ప్రధాన క్రీడ

జ్యోతి క్లబ్‌లో నిర్వహిస్తున్న యోగా క్రీడల పోటీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతున్న కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

చంపాపేట, జూలై 20: అందరి ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రధాన క్రీడ అని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని జ్యోతి క్లబ్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ ఇంటర్ స్కూల్ అండ్ కాలేజీ యోగాసనాల క్రీడా పోటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు, మానసిక ఉల్లాసానికి యోగా ప్రధాన క్రీడ అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు.

పౌర గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలి

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రంథాలయ నిరుద్యోగ సంఘం అభ్యర్థులు

సుల్తానాబజార్, జూలై 20: పౌర గ్రంథాలయాల్లో లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ తెలంగాణ గ్రంథాలయ నిరుద్యోగ సంఘం కోరింది. శనివారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో కలిసి వారు వినతి పత్రం అందజేశారు. నిరుద్యోగ అభ్యర్థులు మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా పబ్లిక్ లైబ్రరీల్లో లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తున్న నేపథ్యంలో స్టేట్ సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ, సిటీ సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ,రీజినల్ పబ్లిక్ లైబ్రరీ,తాలుకా పబ్లిక్ లైబ్రరీ, మండల పబ్లిక్ లైబ్రరీ, విలేజ్ రిపబ్లిక్ లైబ్రరీల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్- 4 పోస్టులను ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న 1000 నుంచి 1500 కు పోస్టులు తగ్గకుండా భర్తీ చేయాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జాబ్ క్యాలెండర్‌లో నోటిఫికేషన్ ఇచ్చేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జానయ్య, శంకర్, కట్టయ్య, సాయిలు, వైఎం గిరి, మాధవీలత, శ్రీనివాస్, చంద్రశేఖర్, ధన్‌రాజ్ ఉన్నారు.

మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఉస్మాన్‌గంజ్ వ్యాపారులతో చర్చలు జరుపుతున్న రాష్ట్ర వ్యవసాయ అదనపు సంచాలకులు రవికుమార్, పక్కన మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి దామోదర్

జహీరాబాద్ కోహినూర్ అల్లానికి మద్దతు ధర ఇవ్వాలి

మలక్‌పేట, జూలై 20: కేరళలో పండించే కోహినూర్ అల్లానికి పలికే మద్దతు ధరను.. జహీరాబాద్‌లో కోహినూర్ అల్లం పండించే రైతులకు కూడా మద్దతు ధర ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ అదనపు సంచాలకులు రవికుమార్ వ్యాపారులకు సూచించారు. జహీరాబాద్‌లో పండించే కోహినూర్ అల్లానికి మద్దతు ధర ఇప్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో శనివారం మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఉస్మాన్‌గంజ్ వ్యాపారులతో అదనపు సంచాలకులు రవికుమార్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లం రైతులకు కూడా మద్దతు ధర ఇప్పించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, దీనిని వ్యాపారులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన వ్యాపారులు తప్పకుండా మద్దతు ధర ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి దామోదర్, అధికారులు పుష్ప, మాధురి, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆలిండియా మేళా

వనస్థలిపురం, జూలై 20: వనస్థలిపురం కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభమైన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా ప్రదర్శనకు రోజు రోజుకూ ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నదని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులతో పాటు నాణ్యమైన సిల్క్ ఉత్పత్తులను ప్రదర్శించామని తెలిపారు. అదేవిధంగా.. బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలర్స్, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, వివిధ రకాల వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచామని నిర్వాహకులు చెప్పారు.

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌ను సన్మానిస్తున్న రంగారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ వెంకటేశ్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కాకి రాములు ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి సన్నీళ్ల వెంకటేశ్ ముదిరాజ్, రమేశ్ ముదిరాజ్, సతీశ్‌చంద్ర ముదిరాజ్.
- కందుకూరు, జూలై 20

వృద్ధురాలు అదృశ్యం

బాలమ్మ (ఫైల్)

కందుకూరు, జూలై 20: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దెబ్బడగూడ గ్రామానికి చెందిన కుమ్మరి బాలమ్మ (85). ఈనెల 18 ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బాలమ్మ కుమారుడు నర్సింహ కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ అసోసియేషన్ బోనాల పోస్టర్ ఆవిష్కరణ

మార్కెట్ అసోసియేషన్ బోనాల ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జి తదితరులు

సైదాబాద్, జూలై 20 : సైదాబాద్‌లో శ్రద్ధా బాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 46వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవం బ్రోచర్లను శనివారం నగర మాజీ డిప్యూటీ మేయర్, శ్రద్ధా బాద్ మార్కెట్ అసోసియేషన్ చైర్మన్ సుభాష్ చందర్జి అసోసియేషన్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28న అమ్మవారికి బోనాల ఉత్సవం, 29న అమ్మవారి ఘటాల ఊరేగింపు, 30న సైదాబాద్ మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రద్ధాబాద్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రామ్‌కుమార్, ఉపాధ్యక్షులు సహదేవ్ యాదవ్, సంగోది పరమేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చందర్జి, సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా నేదునూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతాప్రభాకర్‌రెడ్డి, మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ భేగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు.
- కందుకూరు, జూలై 20